సంపుటి :03 | సంచిక :48 | పేజీలు :07 | www.aksharadarbar.com

అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

సోమవారం 30, మార్చి 2026



## ఐడీఓసీ పన్ను రూ.85.61 లక్షలు

బకాయిల చెక్ బల్దియాకు
అందజేసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

03

# భూపాలపల్లి భూపాలుడు !

## మున్సిపాలిటీలో షాడో కమిషనర్

- తన విధులతో పాటు అన్నీ తానై ఇతర విభాగాల్లో వేలు
- పారిశుధ్య పనుల నుంచి ట్రేడ్ లైసెన్సుల వరకు
- వాహనాల డీజిల్ నుంచి పేమెంట్స్ వరకు..
- అన్నింటా.. సదరు 'షాడో'దే నిర్ణయం
- రూ.లక్షల నిధులు దారి మళ్లింపు
- జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల నజర్ అత్యవసరం
- నిగ్గు తేల్చాలని పట్టణవాసుల డిమాండ్

భూపాలపల్లి మున్సిపాలిటీలో పాలన పూర్తిగా గాడి తప్పుతోంది. ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి ఇక్కడ షాడో కమిషనర్‌గా చక్రం తిప్పుతున్నాడు. నిధుల మళ్లింపు నుంచి బిల్లుల ఆమోదం వరకు అంతా ఆయన కనుసన్నల్లోనే జరుగుతోంది. కొత్తగా వచ్చిన కమిషనర్ ప్రేక్షక పాత్ర వహించడం, సదరు షాడో చెప్పినట్లే నడచుకుంటూ ఉండటంతో అక్రమాలకు అడ్డులేకుండా పోతుంది. పారిశుద్ధ్య పనులు, డీజీల్ బిల్లులు, ట్రేడ్ లైసెన్సుల జారీలో సదరు ఉద్యోగి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. మొత్తంగా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్న ఈ 'పుర పాలుడి' ఆగడాలపై ఉన్నతాధికారులు స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– అక్షరదర్బార్, హనుమకొండ

02






## ఏసీబీకి చిక్కిన తిమ్మాజిపేట ఎస్సై

వాహనాల విడుదలకు రూ.30 వేల డిమాండ్
రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

02

## బాల్యానికి భరోసా..



- వలస కార్మికుల పిల్లలకు విద్యా కానుక
- ఇటుక బట్టీల నుంచి బడి బాట వరకు..
- ఆపరేషన్ స్మైల్ తో వెలిగిన 120 మంది బాలల ముఖాలు : సీపీ సన్ ప్రీత్ సింగ్

## నక్సల్ రహిత భారత్



- కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- బస్తర్‌లో ముగిసిన అరాచకాల శకం
- లోక్‌సభ వేదికగా చారిత్రాత్మక ప్రకటన
- బుల్లెట్‌కు బుల్లెట్టే మా సమాధానం
- మిగిలిన మావోయిస్టులకు మాస్ వార్నింగ్

02


## గణపతి గారూ.. లొంగిపోండి !

- ఇదే మీకు చివరి అవకాశం
- లొంగిపోతేనే గౌరవప్రదమైన జీవితం
- మావోయిస్టు పార్టీ అగ్రనేతకు డీజీపీ శివధర్‌రెడ్డి పిలుపు

03

www.aksharadarbar.com
అక్షర దర్బార్ Voice of the people





- తన విధులతో పాటు అన్నీ తానై ఇతర విభాగాల్లో వేలు
- పారిశుధ్య పనుల నుంచి ట్రేడ్ లైసెన్సుల వరకు
- వాహనాల డీజిల్ నుంచి పేమెంట్స్ వరకు..
- అన్నింటా.. సదరు 'షాడో'దే నిర్ణయం
- రూ.లక్షల నిధులు దారి మళ్లింపు
- జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల నజర్ అత్యవసరం
- నిగ్గు తేల్చాలని పట్టణవాసుల డిమాండ్

# భూపాలపల్లి భూపాలుడు !

## - మున్సిపాలిటీలో షాడో కమిషనర్

**భూపాలపల్లి మున్సిపాలిటీలో పాలన పూర్తిగా గాడి తప్పుతోంది. ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి ఇక్కడ షాడో కమిషనర్‌గా చక్రం తిప్పుతున్నాడు. నిధుల మళ్లింపు నుంచి బిల్లుల ఆమోదం వరకు అంతా ఆయన కనుసన్నల్లోనే జరుగుతోంది. కొత్తగా వచ్చిన కమిషనర్ ప్రేక్షక పాత్ర వహించడం, సదరు షాడో చెప్పినట్లే నడచుకుంటూ ఉండటంతో అక్రమాలకు అడ్డు లేకుండా పోతుంది. పారిశుద్ధ్య పనులు, డీజీల్ బిల్లులు, ట్రేడ్ లైసెన్సుల జారీలో సదరు ఉద్యోగి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. మొత్తంగా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్న ఈ 'పుర పాలుడి' ఆగడాలపై ఉన్నతాధికారులు స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.**

**అక్షరదర్బార్, హనుమకొండ :**

భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయనో సాధారణ ఉద్యోగి. వాస్తవంగా చెప్పాలంటే సర్కార్ పెద్ద గుమస్తా. కానీ, ఆయన దీవి, ఆయన దర్పమే వేరు. భూపాలపల్లి బల్దియా అంతా ఆయన కనుసన్నల్లోనే నడుస్తుంది.. ఆయన చిటికెస్తే మున్సిపాలిటీనే కదులుతుంది. పురపాలికలో గుండు గుత్తగా పెత్తనమంతా ఆయనదే. ఎక్కడా ఏ పారిశుధ్య పని జరగాలి. ఏ వాహనంలో ఎంత డీజిల్ కొట్టించాలి... దానికి ఎంత బిల్లు వేయించాలి.. దేనికి ఎంత ఖర్చయింది.. అన్న విషయాలన్నీ సదరు అధికారి గారే చూసుకుంటారు.. తనకు నచ్చినంత బిల్లులు పెట్టుకుంటారు. నచ్చినంత అప్రూవల్ చేయించుకుంటారు. రూ.లక్షలకు లక్షలు దోచుకుంటారు. దోచుకున్నది దాచేసుకుంటారు.. కొత్తగా వచ్చిన కమిషనర్ ప్రేక్షక పాత్ర వహిస్తుండగా, పాలన కూడా పూర్తిగా గాడి తప్పింది. బల్దియా నిధులన్నీ పక్క దారి పడుతున్నాయి. ఇవన్నీ భూపాలపల్లి పట్టణవాసులు చెప్తున్న విషయాలు.

### - గాడి తప్పిన పాలన

కొత్తగా వచ్చిన కమిషనర్ కు ఏమి తెలియకుండా చేస్తూ, తన ప్రతిపాదనలు, సూచనలు, తను చెప్పిందే కమిషనర్ వినేలా వాతావరణాన్ని సృష్టించి అన్ని తానై వ్యవహరిస్తున్నాడు. మున్సిపాలిటీ కొత్త పాలకవర్గాన్ని కూడా తన లైన్ లోకే తెచ్చుకుంటూ సదరు అధికారి పెత్తనం సాగిస్తున్నాడనే చర్చ ఇక్కడ నడుస్తున్నది. ఇంకా గట్టిగా చెప్పాలంటే, కమిషనర్ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మరికొందరైతే.. సదరు అధికారే షాడో కమిషనర్ గా వ్యవహరిస్తున్నాడని కూడా చెప్తున్నారు. పురపాలికలో ఇక ఏ పని ఉన్నా, కమిషనర్‌ను పక్కన పెట్టి, తమ పనులు పూర్తి చేయించుకునేందుకు కాంట్రాక్టర్లు, ప్రజలు కూడా ఆయన వద్దకే వెళ్తున్నారని కూడా తెలిసింది. ఏదేమైనా , మున్సిపాలిటీలో పాలన గడి తప్పిందనేది వాస్తవం. ఇప్పటికైనా, కలెక్టర్ రాహుల్‌శర్మ, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు భూపాలపల్లి మున్సిపాలిటీపై ప్రత్యేక నజర్ పెట్టి, అసలు మున్సిపాలిటీలో ఏం జరుగుతుందనే విషయంపై నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది. గాడి తప్పిన మున్సిపల్ పాలనను, తిరిగి గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అంతేకాదు విజిలెన్స్ సహా ప్రభుత్వ నిఘా వర్గాలు ఈ మున్సిపాలిటీలో జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి సారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### - వేలు పెట్టని విభాగం లేదు..

**భూపలిపల్లి రోజురోజుకు తనపరిధిని విస్తరించుకుంటూ అతి పెద్ద పట్టణంలా అవతరిస్తున్నది. జనాభాకూడా రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రస్తుతం బల్దియా గ్రేడ్ -3 స్థాయి నుంచి గ్రేడ్-2 కు ఎదిగే దిశగా అడుగులు వేస్తుంది. ఈ మున్సిపాలిటీకీ గ్రూప్-1 స్థాయి అధికారి కమిషనర్ పాలన సాగుతున్నది. ఇంత కీలకమైన పట్టణాన్ని ఒక షాడో కమిషనర్ పాలిస్తున్నాడు. ఈయన ఒక సాధారణ ఉద్యోగి. ఖర్చులకు, వ్యయాలకు సంబంధించిన లెక్కలు రాయడం, వోచర్లు రాయడం, చెక్కులు రాయడం, పేమెంట్స్ ఇలాంటి పనులు చూడాలి. కానీ, ఆయన పరిపాలన విభాగంలో తలదూరుస్తున్నాడు. పారిశుద్ధ్య పనులు ఎక్కడ జరగాలి, మున్సిపాలిటీ వాటర్ ట్యాంకర్లు వాటర్ ఎక్కడ సరఫరా చేయాలనేది తనే పర్యవేక్షిస్తున్నాడు. తన అసిస్టెంట్ కు బాధ్యతలు ఇప్పించి వ్యాపారులకు తనే ట్రేడ్ లైసెన్స్‌లు ఇప్పిస్తున్నాడు. పారిశుధ్య విభాగంలో తనకు నచ్చిన వ్యక్తికి బాధ్యతలు అప్పగించాడు. ప్రభుత్వ ఉద్యోగులైన జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను, గ్రూప్-4 స్థాయి సిబ్బందితో పాటు రెగ్యులర్ ఉద్యోగులను పక్కన పెట్టి ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి పెత్తనం అప్పగించాడు. అలా, అతనికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గా ఇప్పించి ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. బల్దియా వాహనాలకు డీజిల్ సదరు అధికారే పోయిస్తున్నాడు. తనకు నచ్చినంత బిల్లులు చేయించుకుంటున్నాడు.**

---

# నక్సల్ రహిత భారత్



- కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- బస్తర్ లో ముగిసిన అరాచకాల శకం
- లోక్ సభ వేదికగా చారిత్రాత్మక ప్రకటన
- బుల్లెట్ కు బుల్లెట్టే మా సమాధానం
- మిగిలిన మావోలకు మాస్ వార్నింగ్


**అక్షరదర్బార్, ఢిల్లీ :**

భారతదేశాన్ని నక్సల్ రహిత దేశంగా మార్చామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం లోక్‌సభ వేదికగా కీలక ప్రకటన చేశారు. కేంద్ర ప్రభుత్వం విధించిన లొంగుబాటు గడువు ముగుస్తున్న నేపథ్యంలో మావోయిస్టుల నిర్మూలనపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. హింసా మార్గాన్ని నమ్ముకున్న వారు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని, వారికి అంతకు మించిన మరో మార్గం లేదని స్పష్టం చేశారు. బస్తర్ లాంటి కీలక ప్రాంతాల్లో నక్సలిజం దాదాపు అంతమైందని, ప్రతి గ్రామంలో పాఠశాలలు, మౌలిక వసతులు కల్పించామని ఆయన వివరించారు. కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో ఆదివాసీల జీవితాల్లో మార్పు రాకపోవడం వల్లే నక్సలిజం పెరిగిందని అమిత్ షా విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు మెరుగుపడ్డాయని తెలిపారు. తెలంగాణ నుంచి కూడా అనేకమంది మావోయిస్టు అగ్రనేతలు గడువుకు ముందే లొంగిపోయారని పేర్కొన్నారు. అరాచకానికి పాల్పడే వారిని భగత్ సింగ్, బిర్సాముండాలతో పోల్చడం తగదని, అమాయక ప్రజలను చంపేవారు దేశభక్తులు కాలేరని హితవు పలికారు. మావోయిస్టుల అజెండాలో అభివృద్ధి లేదని, కేవలం ఉనికి కోసమే పోరాడుతున్నారని అమిత్ షా మండిపడ్డారు. వారు విదేశీ సిద్ధాంతాలను దిగుమతి చేసుకున్నారని, వారి హింసా రాజకీయాలకు ప్రస్తుత సమాజంలో తావు లేదని ఎద్దేవా చేశారు. గత కొన్నాళ్లుగా జరిగిన ఆపరేషన్లలో 30 మంది అగ్రనేతలు ఎన్‌కౌంటర్ అయ్యారని గుర్తుచేస్తూ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెబుతామని హెచ్చరిస్తూ, నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా ఆకాంక్షిస్తున్నారని హోంమంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు.

---

# ఏసీబీకి చిక్కిన తిమ్మాజిపేట ఎస్సై

- వాహనాల విడుదలకు రూ.30 వేల డిమాండ్
- రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టివేత



అక్షరదర్బార్, నాగర్ కర్నూల్ : నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల ఎస్సై హరిప్రసాద్ రెడ్డి సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఒక కేసుకు సంబంధించి వాహనాలను విడుదల చేయడానికి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ నేతృత్వంలోని బృందం ఆయనను అదుపులోకి తీసుకుంది. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీని ఈ నెల 5న పట్టుకున్న ఎస్సై వాటిపై కేసు నమోదు చేసి మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు రూ. 60 వేల జరిమానా విధించగా బాధితుడు ఆ మొత్తాన్ని చెల్లించి వాహనాల విడుదల పత్రాలను ఎస్సైకి అందజేశాడు. అయితే మైనింగ్ ఫైన్ కట్టినప్పటికీ అదనంగా రూ. 30 వేలు ఇస్తేనే వాహనాలను వదులుతామని ఎస్సై డిమాండ్ చేశారు. ఇప్పటికే భారీ మొత్తంలో జరిమానా కట్టి మళ్లీ లంచం ఇవ్వలేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల వ్యూహం ప్రకారం సోమవారం పోలీస్ స్టేషన్‌లో రూ. 20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ బృందం ఎస్సైని పట్టుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు.

# జనగణన సమర్థవంతంగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్ లో సెన్సస్ డైరెక్టర్ భారతి హోళీకేరి ఆదేశం



జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధం: కలెక్టర్ స్నేహ శబరీష్
అక్షర దర్బార్, మహబూబాబాద్ : దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణన (సెన్సస్) ప్రక్రియను జిల్లాల్లో అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని సెన్సస్ డైరెక్టర్ భారతి హోళీకేరి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జనగణన అధికారులతో ఇళ్ల గణన, మ్యాప్ తయారీ, ఎన్యుమ రేటర్లు మరియు సూపర్వైజర్ల నియామకంపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనగణనలో భాగంగా ఇళ్ల గణన ప్రక్రియను అత్యంత పకడ్బం దీగా చేపట్టాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, యాప్‌లను వినియోగించుకోవాలని సూచించారు. డేటా సేకరణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వాలని, యాప్ నిర్వహణలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబాబాద్ ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో సెన్సస్ కార్యక్రమం విజయవంతం అయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని డైరెక్టరుకు వివరించారు. ఇప్పటికే సంబంధిత సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని, మండలాల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు. సమావేశంలో సీపీఓ శ్రీనివాస రావు మరియు ఇతర గణన అధికారులు పాల్గొన్నారు.



# ఎస్సీ నిరుద్యోగ యువతకు భారీ సబ్సిడీతో వాహనాలు

- 90 శాతం రాయితీతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు
- ఏప్రిల్ 8లోగా దరఖాస్తు చేసుకోవాలి : అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 అమలుపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి (డీఎల్ఎస్) సమీక్షా సమావేశం జరిగింది. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే పలు పథకాలపై అధికారులు, బ్యాంకర్లతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ యువత ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం భారీ సబ్సిడీలతో వాహనాలు, సోలార్ యూనిట్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా రూ. 1 లక్ష విలువ గల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను 90 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే రూ. 3 లక్షల విలువ గల త్రిచక్ర (గూడ్స్/ప్యాసింజర్) వాహనాలకు 70 శాతం, రూ. 3 నుండి 7 లక్షల విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లకు 60 శాతం సబ్సిడీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాకు ఈ పథకం కింద 96 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, 46 త్రిచక్ర వాహనాలు, 10 సోలార్ యూనిట్లు కేటాయించినట్లు అదనపు కలెక్టర్ వివరించారు. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఏప్రిల్ 8, 2026 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బ్యాంకర్లు ఈ దరఖాస్తులను వేగంగా పరిశీలించి, రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేసి యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్థిరమైన ఆదాయం పొందాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస రావు, ఎల్డీఎం యాదగిరి, పరిశ్రమల అధికారి శ్రీమన్నారాయణ, పశువైద్య శాఖ అధికారి కిరణ్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ మరియు వివిధ శాఖల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# గణపతి గారూ.. లొంగిపోండి !

- ఇదే మీకు చివరి అవకాశం
- లొంగిపోతేనే గౌరవప్రదమైన జీవితం
- మావోయిస్టు పార్టీ అగ్రనేతకు డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు

అక్షరదర్బార్, హైదరాబాద్ అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు హింసా మార్గాన్ని విడనాడి, జన జీవన స్రవంతిలో కలిసి గౌరవప్రదమైన జీవితం కొనసాగించాలని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సోమవారం చిట్టచివరి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విధించిన గడువు రేపటితో ముగియనున్న నేపథ్యంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు ఆరోగ్యం క్షీణించిందనే సమాచారం తమ వద్ద ఉందని వెల్లడించారు. గణపతి వెంటనే లొంగిపోవాలని, ఆయన లొంగిపోతే ప్రభుత్వ ఖర్చులతోనే పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందిస్తామని డీజీపీ ఈ సందర్భంగా భరోసానిచ్చారు. గణపతితో పాటు అజ్ఞాతంలో ఉన్న మరో ఏడుగురు ముఖ్య నేతలు కూడా వెంటనే లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్ల కాలంలో సుమారు 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఆయన వివరించారు. సరెండర్ అయిన ప్రతి ఒక్కరికీ వారి హోదాలతో సంబంధం లేకుండా ప్రభుత్వం తరపున అన్ని రకాల ప్రయోజనాలు కల్పించామని గుర్తు చేశారు. ఆయుధాలు వీడి వస్తే సమాజంలో తలెత్తుకుని జీవించేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, మెరుగైన పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు. కేంద్రం విధించిన డెడ్‌లైన్ మార్చి 31తో ముగియనుండటంతో ఇంకా అజ్ఞాతంలో ఉన్న వారు ఈ చివరి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం ఇచ్చే రివార్డులు, ఇతర ప్రోత్సాహకాలపై పూర్తి పారదర్శకత ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అగ్రనేతలు సైతం వృద్ధాప్యం, అనారోగ్య సమస్యల దృష్ట్యా హింసా రాజకీయాలను పక్కన పెట్టి సాధారణ పౌరులుగా జీవించేందుకు ముందుకు రావాలని కోరారు.




# చలివేంద్రం ఏర్పాటు

అక్షరదర్బార్, హనుమకొండ: పాదాచారుల దాహార్తి తీర్చాలనే సంకల్పంతో ఉచిత త్రాగునీటి సౌకర్యం కల్పించినట్లు ప్రముఖ జర్నలిస్ట్ పిన్న శివకుమార్ చెప్పారు. హనుమకొండ బాలసముద్రంలో స్వచ్ఛందంగా చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. ఎండ తీవ్రత వల్ల బాటసారులు, ప్రయాణీకులు ఇబ్బందులకు గురికాకుండా దాహం తీర్చేందుకు ముందుకువచ్చిన వ్యాపారవేత్త సత్యనారాయణ రెడ్డి, చోల్లేటి శ్రీధర్, పాత్రికేయులు ఉళ్ళెంగుల మహేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చలివేంద్రాన్ని అందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మందపల్లి కిష్టయ్య, భూపతి రాజన్న పాల్గొన్నారు.

# ఐడీఓసీ పన్ను రూ.85.61 లక్షలు

- బకాయిల చెక్ బల్దియాకు అందజేసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



అక్షరదర్బార్, హనుమకొండ: హన్మకొండలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయాలకు (ఐడీఓసీ) సంబంధించిన పన్ను బకాయిలుగా రూ.85,61,262 మొత్తానికి చెక్కును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం హన్మకొండ కలెక్టరేట్ కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ (బల్దియా) అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నగర పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు తమకు ఉన్న పన్ను బకాయిలను వెంటనే చెల్లించి బల్దియాకు సహకరించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ముగింపునకు కేవలం ఒక రోజు మాత్రమే గడువు మిగిలి ఉన్న నేపథ్యంలో, మార్చి 31 అర్ధరాత్రి వరకు బల్దియా సేవా కేంద్రాలు నగరవ్యాప్తంగా పనిచేస్తాయని తెలిపారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తి పన్ను, నీటి పన్నుతో పాటు ఇతర బకాయిలను సమయానికి చెల్లించాలని కోరారు. పన్నుల చెల్లింపులో ప్రజల భాగస్వామ్యం నగర అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డా రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు (అడ్మిన్) సమ్మయ్య, బిర్రు శ్రీనివాస్, ఆర్ఐ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి



అక్షర దర్బార్ చిట్యాల :వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నందున అంగన్వాడికి వెళ్లే పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద సూచించారు. జడల్‌పేట భీష్మనగర్ అంగన్వాడి కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిల్లలు, మహిళలు చల్లటి వాతావరణంలో ఉండాలని, అధికంగా ఏసీలు, కూలర్ల వద్ద ఉండకుండా జాగ్రత్తపడాలని అన్నారు. ఫ్రిజ్ నీరు, కూల్ డ్రింక్స్‌కు బదులుగా కుండ నీరు తాగాలని సూచించారు. కీరదోసకాయలు, మజ్జిగ, నిమ్మరసం, రాగి జావ, అంబలి, కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు వంటి పోషకాహారం తీసుకోవాలని తెలిపారు.



# సీఐని కలిసిన ప్రెస్ క్లబ్ సభ్యులు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు సోమవారం చిట్యాల సిఐ డి మల్లేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ మల్లేష్ మాట్లాడుతూ.. పాత్రికేయులు కలిసి సంఘటితంగా నూతన ప్రెస్ క్లబ్ కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. సిఐని కలిసిన వారిలో మొగుళ్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మల సారయ్య ప్రధాన కార్యదర్శి కట్కూరి ఐలయ్య పాత్రికేయులు రాళ్ల బండి శ్రీనివాస్ పెద్దోజు దేవేందర్ నవీన్ మహేష్ కేతరాజు రజనీకాంత్ చెక్క శ్రీధర్ మంగళంపల్లి శ్రీనివాస్ గుండారపు రమేష్ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలాపూర్ బోడగుట్ట భూమిని కాపాడాలి

సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామ శివారులోని బోడగుట్ట ప్రభుత్వ భూములను అక్రమణ దారుల నుండి స్వాధీనం చేసుకుని రక్షించాలని సిపిఐ ఎంఎల్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు.సోమవారం గ్రామస్తులతో కలిసి భూములను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ 2017–18లో కొంతమంది అక్రమంగా పట్టాలు పొందించి భూమిని ఇతరులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. సహజ సంపదైన గుట్టను కాపాడాలని, అక్రమ పట్టాలను రద్దు చేసి అధికారులు వెంటనే సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని కోరారు.లేకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# హామీలు అమలు చేయాలి

అక్షర దర్బార్, శాయంపేట: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఫోరం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్, మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గౌరవ వేతనం, ఇంటి స్థలం వంటి హామీలు ఇంకా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని ప్రజా పాలన చేయాలని స్పష్టం చేశారు.

# హామీలు అడిగితే అరెస్టులా?



అక్షర దర్బార్, శాయంపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరినందుకు ఉద్యమకారులను అరెస్టు చేయడం అన్యాయమని తెలంగాణ ఉద్యమకారుడు, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ విమర్శించారు.తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేయడం తప్పు అని ఆయన అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో హక్కుల కోసం పోరాడుతున్న ఉద్యమకారులను అణచివేయడం సరికాదని, వారికి న్యాయం చేయాలని కోరారు.



# బహిరంగంగా చెత్త వేస్తే భారీ జరిమానా

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ లో 13వ డివిజన్ దేశాయిపేట్ రోడ్డు కమర్షియల్ ఇంటి నుండి చెత్తను మున్సిపల్ స్వచ్ఛ ఆటో కు ఇవ్వకుండా ఓపెన్ ప్లేస్ లలో పడే వేసినందుకు మూడు ఇండ్లకు భారీగా జరిమాన విధించినట్లు 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్ కుమార్ జోషి తెలిపారు. సోమవారం బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన కమర్షియల్ షాపుల యజమానులకు ముగ్గురికి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున జరిమానా మొత్తం రూ.10వేలు చెల్లించాలని జారీ చేసిన నోటీసులను వారికి అందించారు. ఇక నుండి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ స్వచ్ఛ ఆటోకు ఇవ్వాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్ స్పెక్టర్ భీమయ్య, జవాన్లు పాల్గొన్నారు.

# ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ లతో యువత జాగ్రత్తగా ఉండాలి



అక్షర దర్బార్ చిట్యాల : ఐపీఎల్ (IPL) సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ యువతను నేరుగా లేదా ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బెట్టింగ్‌కి పాల్పడరాని హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ, యువత ఈజీ మనీ కోసం తమ భవిష్యత్తును, తల్లిదండ్రుల నమ్మకాన్ని దీర్ఘకాలంలో పాడుచేస్తున్నారని తెలిపారు. మార్కెట్లో ఉన్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు యువతను ఆకర్షించి అప్పుల్లో పడుస్తున్నాయని, ఇలాంటి కార్యకలాపాలపై సైబర్ క్రైమ్, లోకల్ పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచారని వెల్లడించారు.ఎవరైనా పట్టుబడితే కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు లేదా పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌కు ఇబ్బందులు రావచ్చని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు వాడే యాప్‌లు, ఫోన్లు ఎవరిసహిత ఉపయోగిస్తున్నారో గమనిస్తూ ఉండాలని, బెట్టింగ్ జరగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

## కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన బాధితులు



అక్షర దర్బార్, చిట్యాల : గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం వల్ల నవాబుపేట పరిధిలోని భూములు, పైపులైన్లు, బావులు, చెట్లు కోల్పోతున్న భూ నిర్వాసితులు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించగా, ఆయన వెంటనే స్పందించి 10 రోజుల్లో నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. భూములు కోల్పోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు వివరించారు. ఈ కార్యక్రమం లో, రైతులు కసిరెడ్డి రత్నాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పింగిలి శ్రీనివాస్ రెడ్డి, బిళ్ల సరోత్తం రెడ్డి, నర్సింహారెడ్డి, దువ్వల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి భారీగా విన్నపాలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ స్వయంగా అర్జీదారుల వద్దకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను తక్షణమే క్లియర్ చేయాలని సూచించారు. వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, అక్కడి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇనుగుర్తి మండలానికి చెందిన ఉపేందర్ తన భూమి పట్టా మార్పుపై ఫిర్యాదు చేయగా, గంగారం మండలం దుబ్బగూడెం గ్రామస్థులు ఫెర్టిలైజర్ దుకాణదారులు ఎరువులను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గార్ల మండలానికి చెందిన సరోజ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, సీరోలు మండలానికి చెందిన అంగోతు లచ్చు తనకు రైతు భరోసా నిధులు అందడం లేదని మొరపెట్టుకున్నారు. కాగా, మొత్తం 168 దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేసిన కలెక్టర్, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ఆర్డీఓలు గణేష్, కృష్ణవేణి, డీఆర్‌డీఓ పీడీ మధుసూదన రాజు, జడ్పీ సీఈఓ పురుషోత్తం మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# రాజీవ్ ఆరోగ్యశ్రీ జిల్లా అధ్యక్షుడిగా గురిజాల తిరుపతి

అక్షర దర్బార్,నడికూడ: రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య మిత్ర హనుమకొండ జిల్లా నూతన అధ్యక్షులుగా నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన గురిజాల తిరుపతి, ఉపాధ్యక్షురాలుగా తాళ్లపెల్లి పావని, రాష్ట్ర అధ్యక్షులు గిరియాదయ్య, రాష్ట్ర కార్యదర్శి కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్ ల ఆధ్వర్యంలో అలాగే హనుమకొండ ఆరోగ్యామిత్రల సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరోగ్యామిత్రాలు, వరంగల్ జిల్లా అధ్యక్షులు కొండా శ్రీకాంత్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దొంతోజు కుమారస్వామి పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన వారిని ఉమ్మడి జిల్లా కోర్డినేటర్, జిల్లా మేనేజర్, టీమ్ లీడర్లు ఆఫీస్ అస్సోసియేట్ అభినదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన తిరుపతి మాట్లాడుతూ మాపై నమ్మకంతో మాకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అలాగే జిల్లా కమిటీ సభ్యులకు అలాగే తోటి ఆరోగ్య మిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



# బ్యాగులు, పండ్లు పంపిణీ

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు సోమవారం రోజున స్కూల్ బ్యాగులు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఎన్నారై గోళ్ల అస్మిత శ్రీమన్ దంపతుల కుమారుడు శక్తి స్వరూప్, వరంగల్ లో ఉంటున్న బరుపాటి అశ్విత్ చంద్ర, యోగిత వర్మ జన్మదినం సందర్భంగా బ్యాగులు, పండ్లు పంపిణీ చేసినట్లు హెచ్ఎం అచ్చ సుదర్శన్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకావత్ దేవ, కంచరాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.



# వెలమ సంఘం ఆధ్వర్యంలో కౌన్సిలర్ కు సన్మానం

అక్షరదర్బార్, పరకాల: ఆల్ ఇండియా పద్మ నాయక వెలమ అసోసియేషన్ పరకాల ఆధ్వర్యంలో 14వ వార్డు కౌన్సిలర్ పడిదెల దీప్తి రాకేష్ రావు ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గం నుంచి దీప్తి గెలవడం సంతోషకరమని, రాబోయే రోజుల్లో ఇంకా పెద్ద ఎత్తున అవకాశాలు రావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెలమ సంఘం నాయకులు దగ్గు విజేందర్ రావు, కొలుగూరి రాజేశ్వర్ రావు, దగ్గు తిరుపతి రావు, భాస్కర్ రావు, శ్యాం రావు, బాబురావు, శ్రీనివాసరావు, కాంతారావు, సాయి చరణ్ రావు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**పరకాల, నడికూడ సర్పంచుల డిమాండ్**

అక్షరదర్బార్, పరకాల: సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న సర్పంచ్‌లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సర్పంచ్‌లు ఖండించారు. సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుల పిలుపు మేరకు ఈ కార్యక్రమానికి వెళ్తుండగా తమను నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యబద్ధంగా రావలసిన నిధులను విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అరెస్ట్ అయిన వారిలో పరకాల, నడికూడ మండలాలకు చెందిన సర్పంచ్‌లు ఉన్నారు.







# గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

అక్షర దర్బార్,ములుగు జిల్లా ప్రతినిధి: 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామసభల నిర్వహణపై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల జాబితా చదివి వినిపించాలని ఆదేశించారు. సమావేశం లో ఆర్డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ఎం పి డి ఓ లు, ఎంపి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి ఆలయం ముఖద్వార ప్రతిష్ఠాపన

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం లోని కంఠాత్మకూర్ గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ తల్లి దేవాలయ ముఖద్వార ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొంగంటి తిరుపతి పాల్గొన్నారు. ఆచార్యులు అఖిల్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, దాతలు పల్లబోయిన మహేందర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమం లో పోచమ్మ తల్లి దేవాలయం చైర్మన్ లు చింతి రెడ్డి రాజిరెడ్డి, ఊట్ల మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బండ్ల వేణు, మాదాసు శ్రీనివాస్, గ్రామ ఉప సర్పంచ్ కంఠాత్మకూర్ కుమారస్వామి,గ్రామ పంచాయతీ సెక్రటరీ లావణ్య, హనుమాన్ దేవాలయం చైర్మన్ మండ సురేష్, సమ్మక్క-సారాలమ్మ జాతర



కమిటీ చైర్మన్ మండ ధనంజయ, కమిటీ సభ్యులు ముద్రబోయిన రమేష్,సామజీ సురేష్,వలస రాజమౌళి, దేవులపల్లి ఐద్రి,వీరాటి వెంకటేశ్వర్లు, దేవులపల్లి ప్రకాష్,రాజోజు సుదర్శన్,మాజీ ఉపసర్పంచ్, హోంగార్డ్ బుస్స బాబు,బుస్స రమేష్, రాజు పాల్గొన్నారు.




# ఓటర్ జాబితా ప్రక్షాళన పకడ్బందీగా నిర్వహించాలి

**బి.ఎల్.ఓల శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్**

అక్షర దర్బార్ శాయంపేట :ఓటర్ జాబితా ప్రక్షాళనలో భాగంగా శాయంపేట మండలంలోని రైతు వేదికలో బి.ఎల్.ఓ.లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్" కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. హౌస్-టు-హౌస్ సర్వే ద్వారా బోగస్ ఓటర్లను గుర్తించి తొలగించడంతో పాటు, మరణించిన ఓటర్ల పేర్లను ఫారం-8 ద్వారా తొలగించాలని తెలిపారు.ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ జాబితాను సిద్ధం చేయడమే లక్ష్యమని, ఈ ప్రక్రియలో ఓటర్లు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ట్రైనింగ్ అధికారులు ఎన్. తిరుపతి, ఎం. రామయ్య, సూపర్వైజర్లు డి. రాజేష్ కన్నా, ఎం. రమేష్, బి. శైలజ, వంగేటి సత్యం, వివిధ గ్రామాల బి.ఎల్.ఓ.లు, జిపిఓలు తదితరులు పాల్గొన్నారు.




# యోగాతో ప్రశాంత జీవితం

అక్షర దర్బార్ చిట్యాల: యోగాతో మాత్రమే జీవితంలో ప్రశాంతత నెలకొంటుందని అనేక సమస్యలకు యోగా పరిష్కారం చూపుతోందని వ్యాధులను నయం చేసి ఆవేశను పెంచుతుందని చిట్యాల సర్పంచి తనయుడు నాలుగవ వార్డు సభ్యుడు నవీన్ ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ తెలిపారు సోమవారం మండల కేంద్రంలో వెల్నెస్ సంస్థ రామచంద్ర మిషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధ్యాన దినోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో యోగ కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమని వారు తెలిపారు ప్రతి ఆదివారం మండల కేంద్రంలో ఉచితంగా నిర్వహించే యోగ శిక్షణ తరగతులను ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు మాధవి అభ్యాసకులు చింతల రమేష్ రంపీసా రవీందర్ లాందే శంకర్రావు అంకం నరసయ్య ప్రసాద్ భూలక్ష్మి మల్లయ్య సదానందం సామల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అడవి బాటలో అక్షర రూపాలు

**ఎల్లపల్లి విద్యార్థుల 'వనదర్శిని'**

అక్షర దర్బార్, మల్హర్ : ఎల్లపల్లి సమీప బొగ్గుల వాగు అటవీ ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో 'వనదర్శిని' కార్యక్రమం నిర్వహించారు. మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రరావు నేతృత్వంలో విద్యార్థులు అడవిని సందర్శించారు. అటవీ అధికారులు చెట్లు, పక్షులు, జంతువుల ప్రాముఖ్యతతో పాటు ఔషధ గుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ భూమయ్య, పీడీ రాజబాబు, ఉపాధ్యాయ బృందం, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915